క్లుప్తంగా

నవోదయకు ఎంపిక


నిరీక్షణ

జలుమూరు: మండలంలోని గొటివాడ పంచాయతీ మూర్తిపేట గ్రామానికి చెందిన సవదాన నిరీక్షణ నవోదయలో ఆరో తరగతికి ఎంపికైంది. తిమడాం గీతాంజలి పబ్లిక్ స్కూల్‌లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదివింది. తల్లిదండ్రులు జోవన జ్యోతి, సింహాచలం వ్యవసాయ కూలీలు. నిరీక్షణకు స్కూల్ కరస్పాండెంట్ వెలమల రామచంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి


పార్వతీపరమేశ్వరులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని జ్యేష్ఠ మాసం శుద్ధ బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం ఘనంగా తిరువీధి నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

యువత పోరు విజయవంతం చేయాలి


చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని, దీనికి నిరసనగా ఈ నెల 23 తేదీన వైఎస్సార్‌సీపీ నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని మెట్టూరులో శనివారం విలేకర్లతో మాట్లాడారు. విద్యార్థులు, నిరుద్యోగులకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. యువత పోరు కార్యక్రమంలో విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులు, పార్టీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

బూర్జ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు అన్నారు. శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా బూర్జ గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవన్నారు. అన్ని గ్రామాల్లోనూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం


అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కొత్తూరు: మండలంలోని మహసింగి గ్రామ సమీపంలో పునర్ నిర్మాణం చేపట్టిన వరహా లక్ష్మి నరసింహా స్వామి ఆలయం వద్ద శనివారం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పలువురు దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యుడు గోగుల వరప్రసాదరావు నాయుడు, పలువురు కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

పరామర్శ..


గోపాల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

కొత్తూరు: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా భామిని మండలంలోని చిన్నదిమిలి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అంగూరు వైకుంఠరావు చెల్లి, కొత్తూరుకు చెందిన చీడి గోపాల్ భార్య అనురాధ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గోపాల్ కుటుంబాన్ని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అంగూరు వైకుంఠరావు, చీడి భాస్కరరావు, భామిని వైస్ ఎంపీపీ భానుగెడ్డ ధర్మారావు, పిన్నింటి హరిబాబు, పిన్నింటి రమేష్ నాయుడు, తదితరులు ఉన్నారు.

ఆరోగ్య 'యోగా'


నరసన్నపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు


పాతపట్నం: మార్కెట్ యార్డులో యోగాసనాలు వేస్తున్న అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు


ఆమదాలవలస: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని యోగాసనాలు వేశారు. యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వక్తలు అన్నారు. యోగా గురువులు యోగాసనాల ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా యోగా గురువులను సత్కరించారు. నరసన్నపేట నియోజకవర్గంలోని నరసన్నపేట, సారవకోట, పోలాకి, జలుమూరు మండలాలు, పాతపట్నం నియోజకవర్గంలో పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట, ఆమదాలవలస నియోజకవర్గంలో ఆమదాలవలస మున్సిపాలిటీ, ఆమదాలవలస, సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ మండలాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్

చతికిలబడి..!


మూతబడిన శివరాంపురం స్కూల్

- కళ తప్పుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- చేరేందుకు ఆసక్తి చూపించని విద్యార్థులు
- క్రమేపీ తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- మూతబడుతున్న పాఠశాలలు


ఇదివరకే మూతబడిన న్యూ స్కూల్


గొనబుపేటలో ఉన్న ముగ్గురు విద్యార్థులు


కానుకుర్తివానిపేటలో ఉన్న ముగ్గురు విద్యార్థులు

నరసన్నపేట: పేద విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడుల్లో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. నాడు – నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దారు. జగనన్న విద్యా కానుక, గోరుముద్ద వంటి కార్యక్రమాలతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు ఆసక్తి చూపించేలా మార్పులు చేశారు. అత్యంత ఆధునిక పరికరాలతో మరుగుదొడ్ల నిర్వహణ, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు చూసి పాఠశాలల్లో విద్యార్థుల చేరిక ఘననీయంగా పెరిగింది. అయితే గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బడుల నిర్వహణ గాలికి వదిలేయడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా పడిపోతోంది.

ఇష్టానుసారంగా మార్పులు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యా విధానాల్లో ఇష్టానుసారంగా మార్పులు చేస్తుండడంతో ప్రభుత్వ బడుల వైపు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. మండలంలోని పలు పాఠశాలల్లో సింగిల్ డిజిట్స్‌లోనే విద్యార్థులు ఉన్నారు. మండలం కేంద్రం నరసన్నపేటలో కూటమి ప్రభుత్వం వచ్చాక న్యూ స్కూల్ గత విద్యా సంవత్సరంలో మూతపడింది. ఈ విద్యా సంవత్సరంలో నడగాం పంచాయతీ శివరాంపురం స్కూల్ మూతబడింది. అధికారికంగా ఈ నెలాఖరుకు ప్రకటిస్తారు. ఇవికాకుండా మండలంలో ముగ్గురు, నలుగురు విద్యార్థులు ఉన్నటువంటి స్కూల్స్ మరికొన్ని ఉన్నాయి. మున్ముందు ఇవికూడా మూతపడే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివరాంపురంలో ఒకే విద్యార్థి గత విద్యా సంవత్సరం నుంచి ఉన్నారు. అది కూడా అక్కడి ఉపాధ్యాయుడు తన గ్రామం నుంచి ఈ విద్యార్థిని తీసుకు వస్తూ స్కూల్‌ను కొనసాగిస్తూ వచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ పరిస్థితికి ఎంఈవో అంగీకరించకపోవడంతో స్కూల్‌ను మూతవేసి అక్కడి ఉపాధ్యాయుడిని మరో పాఠశాలకు పంపారు. అలాగే కొబగాం, గొనబుపేట, దాసరివానిపేట, మామిడివలస, నర్సింగపల్లి, సుందరాపురం స్కూల్స్‌లో కూడా విద్యార్థుల సంఖ్య పదిలోపే ఉంది. పాలకొండపేటలో 10 మంది, కొల్లవానిపేటలో 12 మంది, రెడ్డికిపేటలో 11 మంది ఉన్నారు. కాగా 2014–19ల మధ్య టీడీపీ హయాంలో మండలంలోని తోటాడ, రెల్లివలస, పెద్దకరగాం, వీఎన్‌పురం స్కూల్స్ మూతబడ్డాయి. ఇప్పుడు న్యూ స్కూల్, శివరాంపురం స్కూల్స్ మూతబడ్డాయి. మున్ముందు మరిన్ని స్కూల్స్ మూతపడే ప్రమాదం ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలపై గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయులకు తగు సూచనలు చేస్తున్నాం. ఉపాధ్యాయులు సైతం ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నారు. మా వరకూ విద్యార్థులను చేర్పించేందుకు చాలా కృషి చేస్తున్నాం.

– శాంతారావు, ఎంఈవో, నరసన్నపేట

ఘనంగా చిరంజీవినాగ్ పుట్టినరోజు వేడుకలు


చిరంజీవినాగ్‌కు కేక్ తినిపిస్తున్న తల్లిదండ్రులు తమ్మినేని సీతారాం, వాణిశ్రీ


చిరంజీవినాగ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కె.వి.జి.సత్యనారాయణ, దుంపల లక్ష్మణరావు

- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు

ఆమదాలవలస: మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం తనయుడు, పార్టీ యువ నాయకుడు చిరంజీవినాగ్ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆమదాలవలసలోని స్వగృహంలో నాయకులు, కార్యకర్తల మధ్య చిరంజీవినాగ్ కేక్ కట్ చేశారు. ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాలు, మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు, తమ్మినేని అభిమానులు చిరంజీవినాగ్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియజేశారు. చిరంజీవినాగ్‌కు తల్లిదండ్రులు సీతారాం, వాణిశ్రీ ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కళింగ కుల అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు (రామారావు), పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విజయనగరం జిల్లా పార్లమెంటరీ పార్టీ పరిశీలకులు కె.వి.జి.సత్యనారాయణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు, మాజీ మున్సిపల్ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, నాయకులు కోట వెంకటరామారావు, జె.కె.వెంకటేశ్వరరావు, గురుగుబెల్లి శ్రీనివాసరావు, మొండేటి కూర్మారావు, సైలాడ దాసు నాయుడు, చలపతిరావు, గొంటి కృష్ణ, టి.వేణుగోపాల్, భాస్కరరావు, తిర్లంగి రామారావు, సురేష్, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


శ్రీకాంత్‌కు తాగునీటి సమస్యను వివరిస్తున్న సుభలయ ఆర్అండ్ కాలనీ వాసులు

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర తూర్పుకాపు విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ అన్నారు. సుభలయ ఆర్అండ్ కాలనీలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిరమండలం మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నట్లు ప్రజలు చెబుతున్నారన్నారు. ఆర్‌డబ్ల్యూస్ డీఈతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. మేజర్ పంచాయతీ సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని శ్రీకాంత్ తెలిపారు. పార్టీ నాయకులు గొర్లె మోహన్‌రావు, బలగ వెంకటరమణ, పాదిలాపు శ్రీరాములు, గొల్లంగి మోహన్‌రావు, తదితరులు ఉన్నారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న తేజేశ్వరరావు

కొత్తూరు: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. కొత్తూరులో శనివారం వికసిత్ భారత్ కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షుడు బూరాడ భాస్కరరావు అధ్యక్షతన జరిగింది. తేజేశ్వరరావుతోపాటు పలువురు బీజేపీ నేతలు మాట్లాడుతూ పేద ప్రజల కోసం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వలన ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. బీజేపీ నాయకులు సువ్వాన ఉమామహేశ్వరి, సలాన రాఘవ, వలురౌతు ప్రసాదరావు, పాకతోట సింహాచలం, భూపతి, ఆఫీస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు

రూ.30 వేల విరాళం

హిరమండలం: స్థానిక పంచాయతీలోని పాత హిరమండలం గ్రామ దేవత కోటదుర్గమ్మ తల్లి ఆలయాన్ని పునర్ నిర్మిస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకుడు లాడె శ్రీకృష్ణ తన తండ్రి జ్ఞాపకార్థం రూ.30 వేలను శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

పుస్తకాల వితరణ

నరసన్నపేట: మండలంలోని సత్యవరం మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు మావుడూరి వెంశీ జ్ఞాపకార్థం ఆయన తండ్రి జగదీష్‌బాబు ఒరవడి పుస్తకాలు వితరణ చేశారు. ఒక్కో విద్యార్థికి ఐదు పుస్తకాల చొప్పున 63 మందికి శనివారం అందజేశారు. హెచ్ఎం ఎస్.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే వెలుగులు


పగలే వెలుగుతున్న వీధి దీపాలు

సారవకోట: అవలింగి గ్రామంలోని చేపల మార్కెట్ సమీపంలో వీధి దీపాలు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. ఇక్కడ గత కొన్ని రోజుల నుంచి పగలు, రాత్రీ తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. దీనిపై సచివాలయ, విద్యుత్ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధ్వానం..


రావాడపేట వద్ద ఏర్పడిన గోతులు

సరుబుజ్జిలి: ఆమదాలవలస నుంచి సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం వరకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో చాలాచోట్ల రహదారిలో గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురిసే సమయంలో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఆమదాలవలస నుంచి పొన్నాంపేట వరకు రహదారి పనులు పూర్తిచేయకపోవడం వలన రాళ్లుతేలాయి. వాహనాలు పాడవుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

మోసం చంద్రబాబు నైజం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది పాలనలో యువతకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు సీఎం చంద్రబాబు మోసం చేశారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ఆయా వర్గాలవారిని మోసం చేస్తున్నారన్నారు. 20 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మరిచిపోయారా అని ప్రశ్నించారు.

నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మించిన చంద్రబాబుకు నిరుద్యోగులకు ఇంకా గుర్తుకు రాలేదా అని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు నిలిచిపోయాయన్నారు. ఫీజులు చెల్లించలేదన్న కారణంగా కొంత మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను ఆయా కాలేజీలు ఇవ్వటం లేదన్నారు. మాట తప్పిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఏడాది పాలనలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందివ్వకుండా వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు తీరుకు నిరసనగా ఈ నెల 23వ తేదీన రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అన్ని వర్గాల వారు భాగస్వామ్యం కావాలని కోరారు.

నిరుద్యోగులకు కూటమి వెన్నుపోటు


యువత పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వరూప్, కృష్ణచైతన్య, పృథ్వీ, నాయకులు

- 23న యువత పోరుబాట
- నరసన్నపేటలో పోస్టర్ ఆవిష్కరించిన స్వరూప్, కృష్ణచైతన్య, నాయకులు

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలతోపాటు యువతకు, నిరుద్యోగులకు వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు మెంటాడ స్వరూప్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. నరసన్నపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీన జిల్లా కేంద్రాంలో నిర్వహించనున్న యువత పోరుబాట పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఏడాది కాలంలో నిరుద్యోగ భృతి ఇవ్వకుండా తీవ్రంగా మోసం చేశారన్నారు. చిరుద్యోగులను తొలగించి వారి కుటుంబాల్లో చీకటి నింపారన్నారు. సంపద సృష్టిస్తామని చెప్పి ఏడాది కాలంలో రూ. 1.53 లక్షల కోట్లు అప్పులు చేశారని విమర్శించారు. యోగాంధ్ర పేరిట రూ. 300 కోట్లు వెచ్చించి గొప్పలు చెప్పుకుంటున్నారని, అప్పులు చేసి ఈ ఆర్భాటాలు అవసరమా అని ప్రశ్నించారు. తల్లికి వందనం అంటూ లక్షల మంది తల్లులకు పథకం వర్తించలేదన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని నిలదీసేందుకు జిల్లాలో ఉన్న యువత, నిరుద్యోగులు ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, జలుమూరు ఎంపీపీ వాన గోపి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ బైరాగినాయుడు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మార్పు పృథ్వీ, నియోజకవర్గ, మండల యువజన విభాగాల అధ్యక్షులు దండి జయప్రకాష్, బుద్దల రాజశేఖర్, రెంటికోట త్రినాథరావు, జుత్తు నేతాజీ, పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, చింతు రామారావు, బగ్గు రామకృష్ణ, నక్క తులసీదాస్, పార్టీ మండల అధ్యక్షుడు లుకలాపు రవి, వరుదు వంశీకృష్ణ, కణితి కృష్ణ, కనుసు సీతారాం, కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం


వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాతపట్నం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడు ఏనుగుతల సూర్యం అన్నారు. పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రి కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వెన్నుపోటు పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులకు అధికారం దాహం తప్ప.. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన లేదన్నారు. ప్రజలకు మంచి జరిగేంతవరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందన్నారు. మాజీ ఎంపీటీసీ మజ్జి జోగారావు, బి.నారాయణమూర్తి, ఎం.తాతయ్య, తూలుగు ప్రవీణ్, టంకాల సుధాకర్, సవిరిగాన కృష్ణారావు, సింగుపురం మురళి, పనుకు మోహన్, మజ్జి వరదరాజులు, పడాల రంజీత్, నేతాజీ, ప్రభాకర్, ఫల్గుణరావు, వంశీ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపు



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలం పొన్నాంపేట సమీపంలో ప్రమాదకరమైన మలుపు. ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వలన తరచూ ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి. ఒకేసారి మలుపు ఉండడం వలన ఎదురుగా వచ్చే వాహనాలు పూర్తిగా కనిపించడంలేదు. గతంలో వేసిన స్పీడ్ బ్రేకర్లు పూర్తిగా శిథిలమయ్యాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

రోడ్డు పక్కనే మురుగు నీరు



ఆమదాలవలస పట్టణ శివార్లలోని ఓవర్ బ్రిడ్జి సమీపంలో గల చెవిటమ్మ తల్లి ఆలయం వద్ద, ప్రధాన రహదారి పక్కనే మురుగు నీరు నిల్వ ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. ఈ మురుగు నీరుకు ప్రధాన కారణం రహదారిపై ఉన్న ఓ కల్యాణ మండపంలో చేస్తున్న వంటలకు సంబంధించినది అని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారిపైకి మురుగునీరు రావడంతో ఇబ్బంది కలుగుతుందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని కోరుతున్నారు.

– ఆమదాలవలస